
# నిజం మనిషి

## ప్రతాప రవిశంకర్



రామతీర్థ ఇప్పుడు ఎక్కడు న్నాడో తెలీదు. దాదాపుగా ఇరవై యేళ్ల క్రితం మేమిద్దరం విడి పోయాం. అలా విడిపోయే ముందు దాదాపుగా ఏడాది క్రితమే మా యిద్దరి మధ్యనా మాటలు లేవు.

ఇలా మాట్లాడుకోకుండా వుండటానికి ముందు రామతీర్థ, నేను మంచి స్నేహితులం. ఇద్దరం ఎప్పుడూ కలిసే వుండేవాళ్లం. రామతీర్థ వాళ్లు మా ఎదురింట్లో వుండేవాళ్ళు. రామతీర్థ తండ్రి ఓ అన్ ఎయిడెడ్ స్కూల్లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేసేవాడు. ఆయన ఆరోగ్యం ఎప్పుడూ సరిగా వుండేది కాదు. ఆర్నెల్లకోసారి వచ్చే జీతం డబ్బులు ఆయన వైద్యానికే సరిపోయేవి కాదు.


రామతీర్థ ఆ ఇంట్లో పుట్టినందుకు చాలాసార్లు బాధపడుతూ వుండేవాడు. అతనలా బాధపడటం నాకూ సబబుగానే అనిపించేది. ఎందుకంటే అతని మనస్తత్వం అటువంటిది.


ఎదుటి మనుషులు ఎవరయినా ఏ కారణం చేతనైనా బాధపడుతూంటే రామతీర్థ భరించగలిగే వాడు కాదు. ఏదోవిధంగా వాళ్లకు సాయపడి వాళ్ల బాధను పోగొట్టాలనే ఆలోచన చేసేవాడు. అతడి ఆలోచనలో ఎప్పుడూ తోటి మనుషులకు సాయం చెయ్యడం గురించే వుండేది. ఎవరయినా కష్టపడుతూంటే అతడు చూడగలిగేవాడు కాదు.

చిన్నవయసులోనే రామతీర్థకు అటువంటి ఆలోచనలు వుండటం మా అందరికీ ఆశ్చర్యంగా, చిత్రంగా వుండేది. సాధారణంగా ఎక్కువమంది మనుషులకు చిన్నతనం నుంచే స్వార్థపరమయిన ఆలోచనలు వుంటాయి. ఎవరి సుఖం గురించే వాళ్లు ఆలోచిస్తారు. కాని రామతీర్థ అందరిలాంటి మనిషి కాదు. అతను ఎప్పుడూ ఎదుటి వారి సుఖం గురించి, సంతోషం గురించీ ఆలోచించే వాడు. తనే ఓ ధనిక కుటుంబంలో పుట్టినట్టయితే వీలైనంత ఎక్కువ మందికి సహాయపడే వాడని అనుకునే వాడు.

ఆ రోజుల్లో రామతీర్థను ఓ పిచ్చివాడిగా అనుకునే వాళ్లం. ఎందుకంటే అలాంటి మనుషులను మేమెప్పుడూ చూడలేదు కాబట్టి, ప్రవాహానికి ఎదురీదే మనుషులను ఎవరిని చూసినా అలాగే అగుపించటం చాలా సహజమయిన విషయం.

తన గురించి ఎవరేమనుకున్నా రామతీర్థ లెక్క చేసే వాడు కాదు. తన ఆలోచనలను మార్చుకునే






వాడు కాదు. మనిషిగా కనీస ధర్మమనే వాడు. అతడి మాటలు వినటానికి బాగానే వున్నా ఆచరణలో చాలా కష్టసాధ్యమనిపించేది.

కాని– ఆశ్చర్యం ఏమిటంటే రామతీర్థ కేవలం మాటల మనిషి కాదు. తన మాటలను ఆచరణలో చూపించేవాడు. ఒక రోజు మధ్యాహ్నం రామతీర్థ, నేను మా క్లాసు పుస్తకాలు కొనటానికి మెయిన్‌రోడ్డుమీద వెళుతున్నాం. బాగా ఎండగా వుంది. కొంతదూరం వెళ్లిన తరువాత కొంచెం దూరంలో మాకు ఎదురుగా ఓ అమ్మాయి గబగబా నడిచి వస్తూ కనిపించింది. రామతీర్థ చూపు ఆ అమ్మాయి పాదాల దగ్గర నిల్చిపోయింది.

రోడ్డుమీదనే ఆగిపోయి ''పాపం.. ఆ చిన్నమ్మాయికి కాళ్ళుకాలుతూ వుంటాయి. ఏం చేద్దాం?'' అన్నాడు రామతీర్థ.

''ఏదయినా షాపులో వాళ్ల పెద్దవాళ్లు వున్నారేమో'' అన్నాను.

ఇంకొంచెం ముందుకు వెళ్లిన తర్వాత కూడా ఆ అమ్మాయి దగ్గరకు ఎవ్వరూ రాలేదు.

''తప్పిపోయి వుంటుంది'' అన్నాడు రామతీర్థ.

ఇద్దరం ఆ పాప దగ్గరకు వెళ్లి వాళ్ల తల్లిదండ్రుల వివరాలను అడిగాము. కానీ చెప్పలేకపోయింది. ఆ అమ్మాయికి కాళ్లు కాలుతున్నాయని రామతీర్థ ఆ పాపను ఎత్తుకున్నాడు.

తర్వాత ఆ పాపను ఎత్తుకుని ఎదురుగా వున్నచెప్పుల షాపులోకి వెళ్లి తను పుస్తకాలు కొనవలసిన డబ్బుల్లో కొంత ఖర్చుచేసి ఆ పాప పాదాలకు రబ్బరు చెప్పులు కొన్నాడు. వద్దని నేను వారించినా అతను వినలేదు. చెప్పులతో ఆ అమ్మాయి రోడ్డు మీద నడుస్తుంటే...

'' ఇప్పుడు నాకో డామ్ కట్టినంత సంతోషంగా వుంది'' అన్నాడు రామతీర్థ.

కానీ నాకేమీ అనిపించలేదు. ఎవరికోసమో మన డబ్బును ఖర్చుపెట్టడం ఎందుకు? అదే డబ్బులు వుంటే ఓ సినిమా చూడవచ్చు అనేది నా ఆలోచన.

కానీ రామతీర్థ సినిమాలు చూసేవాడు కాదు. మనం కాలక్షేపానికి ఖర్చుపెట్టే డబ్బులతో ఎవరయినా అవసరంలో వున్న పేదవాళ్లకు సాయపడవచ్చు అనేది అతడి ఆలోచన.

రామతీర్థ ఆ అమ్మాయి తప్పిపోయిందనే నిర్ణయానికి వచ్చిన వాడయి ఆ పాపను తీసుకువెళ్లి దగ్గరలో వున్న పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు.

''మనకెందుకు రిస్కు?'' అన్నాను.

అతడు నవ్వి ''అలా అనుకోకూడదు. ఆ వయసులో మనం తప్పిపోయి వుండి ఇంకెవరికో దొరికి వాళ్లు కూడా నీలాగే అనుకుని వుంటే ఈ రోజు మనం మన అమ్మానాన్నల దగ్గర వుండేవాళ్లమా?'' అని అడిగాడు.

నేను దిక్కుతోచక దిక్కులు చూశాను.

ఆరోజు పుస్తకాలన్నింటినీ కొననందుకు వాళ్ల నాన్న చేత రామతీర్థ ఘోరంగా తిట్లు తిన్నాడు. కారణమడిగితే తను చేసిన పనిని ధైర్యంగా తండ్రికి చెప్పి మరిన్ని అక్షింతలు వేయించుకున్నాడు.

''పోనీ.. నీ పద్ధతి మార్చుకోకూడదూ?'' అన్నాను రామతీర్థతో.

'' ఎందుకూ?''

''ఇందువల్ల నువ్వు తిట్లు తింటున్నావ్. విమర్శించబడుతున్నావ్.. అందుకు''

అతడు మళ్లీ ఎప్పటిలాగే నవ్వి ''మనం మంచి పని అని నమ్మి ఒకపని చేసేటప్పుడు తిట్లకీ, విమర్శలకీ భయపడి వూరుకుంటే ఈ సమాజం ముందుకు నడవదు. ఒక మంచి పనిని ఒకరిని చూసి మరొకరు నేర్చుకుంటే మొత్తం సమాజమే మారిపోతుంది. దేవుడు ఇంతమంది మనుషులను సృష్టించాడు. ఎందుకు? ఒకరికొకరు సాయపడుతూ ఒకరినొకరు అర్థం చేసుకుని, ఒకరి అవసరాలు ఇంకొకరు తీరుస్తూ, ఉన్నదాన్ని నలుగురూ పంచుకుంటూ సుఖంగా, సంతోషంగా వుండమని. అదీ పరమార్థం. ఇందుకోసం నేను ఎన్ని తిట్లయినా తింటాను. ఎన్ని విమర్శలయినా ఎదుర్కొంటాను. కానీ నేను నమ్మిన దాన్ని మాత్రం వదులుకోను'' అన్నాడు రామతీర్థ కరాకండీగా.

అప్పుడు అతన్ని చూస్తే నాకు భయంతో కూడిన సంతోషం కలిగింది.

రామతీర్థకు మనుషుల పట్లనే కాకుండా ఇతర జీవుల పట్లకూడా కావలసినంత జాలివుంది.

అతను తరచుగా మా వూరి బయట వున్న చెరువుదగ్గరకు వెళ్లేవాడు. కూడా నేనూ వెళ్లేవాడిని. అతడు వస్తూ మరమరాలు, ఇతర ధాన్యం గింజలూ తీసుకువచ్చి చెరువు చుట్టూ తిరుగుతూ చాలా చోట్ల వాటిని నీళ్లలో కలిపేవాడు.

ఎందుకని అడిగితే–

''చెరువులో వుండే జలచరాలు ఇష్టంగా తింటాయి. మనకు దొరికే ఆహారం వీటికి దొరకదు కదా!'' అని చెప్పేవాడు.

మేమిద్దరం కాలేజీకి వెళ్ళేటప్పుడు కూడా ఇంట్లో వాళ్లు చూడకుండా రామతీర్థ చక్కెరను చిన్న కవరులో పోసుకుని వచ్చేవాడు.

'' ఎందుకు క్లాసులో తింటావా?'' అని అడిగాను మొదటి సారి ఆ చక్కెరను చూసి.

''కాదు.. నువ్వేచూడు'' అని ఆ చక్కెరను కొంచెం కొంచెంగా గోడపక్కనే వున్న చిన్న చిన్న రంధ్రాల దగ్గర పోశాడు.

ఐదు నిముషాల్లో మేం అక్కడకు వచ్చి చూస్తే అక్కడ అన్నీ గుట్టలుగా చీమలు. పంచదారను తింటూ వుండేవి. ఆ దృశ్యాన్ని రామతీర్థ సంతోషంగానూ, తృప్తిగానూ చూస్తుండేవాడు.

''కనీసం ఈ చీమలకయినా ఆహారాన్ని పెట్టగలిగే అవకాశాన్ని కల్పించాడు. ఆ భగవంతుడికి కృతజ్ఞతలు'' అనేవాడు రామతీర్థ కళ్ళు మూసుకుని.

రామతీర్థ గురించి మా బామ్మకు చెప్పిన ప్రతిసారీ ''రామతీర్థ మామూలు మనిషి కాదురా.. అలాంటి వాళ్లు లక్షమందిలో ఒక్కరు కూడా వుండరురా.. ఈ వయసుకే ఇంతటి ఉన్నతమైన ఆలోచనలు వున్నాయంటే అతగాడు గొప్ప మహనీయుడు అవుతాడు. చాలా గొప్పమనిషి'' అని మెచ్చుకునేది.

ఈ విషయాన్నే ఒకసారి రామతీర్థతో అంటే ''ఇందులో పొగడటానికి ఏముంది? ఓ మనిషిగా నేను చెయ్యావలసిన పనిని నేను చేస్తున్నాను. మనుషులమై పుట్టి తోటి మనిషికి సాయపడనప్పుడు



మనం మనుషులమని చెప్పుకోవడం ఎందుకు? వృథా'' అన్నాడు.

అతను ఇంట్లో కొంచెం తీరికగా వున్నప్పుడు, ఇంటిముందు ధాన్యం గింజలను చల్లేవాడు. రకరకాల పక్షులు వచ్చి వాటిని ఏరుకు తింటున్నప్పుడు అతను చాలా సంతోషపడిపోయేవాడు. కానీ వాళ్లమ్మ, నాన్నా తిడుతూనే వుండేవాళ్లు. అయినా రామతీర్థ లెక్కచేసేవాడు కాదు.

మా నాన్న క్యాంపులో వున్నప్పుడు ఒకసారి మా అమ్మకు జ్వరం వచ్చింది. నేను ఇంట్లో లేనందువల్ల నా కోసం వచ్చిన రామతీర్థకు మా అమ్మ ఇరవై రూపాయలు ఇచ్చి ఏవో మందు బిళ్లలను తీసుకురమ్మని చెప్పిందట. ఆ డబ్బులతో వెళ్లిన రామతీర్థ అరగంట తర్వాత ఖాళీగా వచ్చి-

''మందులు తీసుకురాలేదు. మీ డబ్బులు మా నాన్నను అడిగి తీసుకుని తర్వాత ఇస్తాను'' అని చెప్పాడుట.

డబ్బులు ఏమయ్యాయని అడిగింది మా అమ్మ.

దారిలో ఎవరో ముసలివాడు పొద్దుట్నించి అన్నం తినలేదనీ, ఆకలవుతోందనీ అరుస్తుంటే వాడిని అక్కడే వున్న ఓ హోటలుకు తీసుకెళ్ళి భోజనం పెట్టించాడుట జాలిపడి.. ఇదీ విషయం.

మా నాన్న క్యాంపునించి వచ్చిన తర్వాత మా అమ్మ ఈవిషయాన్ని చెప్పింది. మా నాన్న డబ్బు దగ్గర చాలా గట్టిమనిషి. అప్పటికప్పుడే నన్ను రామతీర్థ తండ్రినడిగి ఆ ఇరవై రూపాయలూ తీసుకురమ్మని పంపించాడు. కానీ ఆయన ఇవ్వలేదు. నాకేం తెలీదు. వాడిదగ్గర వసూలు చేసుకురమ్మని చెప్పాడు.

ఆయన అలా అన్నందుకు ఎగిరిపడి రామతీర్థకూ, అతడితో స్నేహం చేస్తున్నందుకూ నన్నూ తిట్టి అతడితో స్నేహాన్ని వదులుకోమని శాసించాడు.

అందువల్ల ఆరోజునించే రామతీర్థతో మాట్లాడటం మానేశాను. ఆ తర్వాత మా ఇంటర్ పరీక్షలయిపోయి మా నాన్న బదిలీ కారణంగా ఆ వూరిని వదిలేశాము. సరిగ్గా అప్పుడే రామతీర్థను ఆఖరిసారిగా చూడటం.

అతను మళ్లీ ఈ ఇరవై ఏళ్లలో ఎప్పుడూ కనపడలేదు.


రామతీర్థ ఇప్పుడు ఎక్కడ వున్నాడో తెలీదు.

ఆఫీసులో కుర్చీలో వెనక్కువాలి కళ్లు మూసుకుని హఠాత్తుగా గుర్తుకు వచ్చిన రామతీర్థ గురించి ఆలోచిస్తున్నప్పుడు ఎదురుగా బల్లమీద వున్న టెలిఫోన్ రింగయ్యింది.

ముందుకు వంగి రిసీవర్ ఎత్తి అవతలి వైపు నించి డాక్టర్ జేమ్స్ చెప్పిన మాటలు విన్న తర్వాత షాక్‌తో గొప్ప ఆందోళనకు గురయ్యాను.

స్కూలునించి తిరిగి వస్తున్న మా పదేళ్ల పాప శ్వేతకు స్కూటర్ యాక్సిడెంటయిందట. ప్రస్తుతం తన నర్సింగ్‌హోమ్‌లోనే వుందని వెంటనే రమ్మని చెప్పాడు డాక్టర్ జేమ్స్.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా బయటకు వచ్చి స్కూటరు మీద జేమ్స్ నర్సింగ్ హోమ్‌కు వెళ్లాను.




డాక్టరు బయటనే నిల్చున్నాడు. ఆయన మా ఫ్యామిలీ డాక్టరు.

'' ఏం జరిగింది?'' ఆత్రంగా అడిగాను.

''రోడ్డుమీద పాప వస్తుంటే ఎవడో కుర్రాడు స్కూటరుమీద వెళుతూ డాష్ ఇచ్చాడుట. పాప పడిపోయింది. సిమెంటురోడ్డు కొంచెం బలంగా తలకు తగిలి గాయమయ్యింది. వెంటనే ఎవరో ఆటోలో ఈ హాస్పిటల్‌కు తీసుకు వచ్చారు. పాపని గుర్తించి మీకు ఫోన్ చేశాను''

పాప వున్న గదిలోకి తీసుకువెళ్లాడు.

బెడ్‌మీద పాప స్పృహలేకుండా వుంది.

రక్తం ఎక్కిస్తున్నారు. పక్కనే వున్న బెడ్‌మీద వున్న మనిషి రక్తాన్నే పాపకు ఎక్కిస్తున్నారు.

''ఎవరితను?'' జేమ్స్‌ను అడిగాను.

''ఎవరో తెలీదు. ఆ టైములో రోడ్డుమీద వెళుతున్నాడుట. పాపను చూసి అతనే ఆటోలో ఇక్కడకు తీసుకువచ్చాడు. బ్లడ్ అవసరమయితే ఇస్తానన్నాడు. పరీక్ష చేశా. ఇద్దరిదీ ఒకటే గ్రూపు. పైగా అతని రక్తం చాలా ఆరోగ్యంగా వుంది. అందుకే ఎక్కిస్తున్నాం. ఏమైనా పాప అదృష్టవంతురాలు'' అన్నాడు జేమ్స్.

ఆ బెడ్‌మీద పడుకున్న మనిషిని కొంచెం పరీక్షగా చూశాను. అతనిడిని ఎక్కడో చూసినట్టు, బాగా పరిచయమున్న మనిషిగా అనిపించాడు.

వెంటనే గుర్తుపట్టాను.

అతను రామతీర్థ.

నా కళ్లలో నీళ్లు తిరిగాయి. రామతీర్థ ఇన్నేళ్ల తర్వాత మా పాపను కాపాడటానికే ఇక్కడకు వచ్చాడా? ఇటువంటి మనిషినా ఇరవై రూపాయల కోసం వేధించింది? ఇరవై రూపాయల కోసం ఇలాంటి ఉత్తముడి స్నేహాన్నా వదులుకున్నది?''

రామతీర్థకు చేతులు జోడించి దణ్ణం పెట్టాను.

''ఏమిటి?'' అన్నాడు జేమ్స్.

''ఇతను దేవుడు'' అన్నాను కళ్లు తుడుచుకుని.

''అంటే?''

అక్కడే వున్న కుర్చీలో కూర్చుని రామతీర్థ గురించి డాక్టర్ జేమ్స్‌తో చెప్పాడు.

''చాలా అరుదైన మనిషి. ఇలాంటి మనుషులు సమాజం కోసమే పుడతారు. సమాజం కోసమే బతుకుతారు. హి యీజ్ సింబల్ ఫర్ హ్యూమానిటీ. ఇతను మీ స్నేహితుడయినం**దుకు** మీరెంతో గర్వపడాలి''

అన్నాడు జేమ్స్.

కానీ ఆయనకు ఇరవై రూపాయల కథను మాత్రం చెప్పలేదు.

కొంచెం సేపటికి రక్తం ఎక్కించడం పూర్తయ్యింది.

రామతీర్థ నన్ను చూసి నిల్చున్నాడు.

అతడిని కౌగిలించుకుని ''నీకెలా కృతజ్ఞతలు చెప్పాలో తెలీడం లేదు. నీ రుణం ఎలా తీర్చుకోను'' అన్నాను.

''నువ్వు రుణం తీర్చుకోవలసిన అవసరం లేదు. నేనే మీ రుణం తీర్చుకున్నాను. కొన్నేళ్ళ క్రితం మీకు నేను ఇరవై రూపాయలు ఇవ్వాలి కదా. ఆ రుణాన్ని ఇప్పుడు ఇలా తీర్చుకున్నానని అనుకో.. సరిపోతుంది'' అన్నాడు.

నా తల తెగి కిందపడినట్లు ఫీలయ్యాను.

